'బకాయి' ముద్దాయి బిఆర్ఎస్సే

- గులాబీ పార్టీ ప్రచారాన్ని తిప్పికొట్టిన మహేశ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రభుత్వం కుప్పలు, తెప్పలుగా చేసిన లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లించడం కూడా బాకీ పడినట్టేనా? అంటూ టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ గులాబీ నేతలను ప్రశ్నించారు. కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ మాజీ మంత్రి కెటిఆర్ సిగ్గుచేటన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిఆర్ఎస్ పాలనలో ఎంత మందికి దళిత బంధు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు రూ.500 సబ్సిడీతో గ్యాస్ సిలిండర్ ఇవ్వడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం కూడా బకాయి పడ్డట్టా? ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.పది లక్షలకు పెంచడం, ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడం, రైతు భరోసా ఇవ్వడం, వరికి బోనస్ ఇవ్వడం, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం, ఇచ్చిన హామీలను నెరవేర్చడం కూడా బకాయి పడ్డట్టా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, ఫార్ములా ఈ కార్ రేస్‌లో అక్రమాలు, పలు ప్రభుత్వ పథకాల్లో కుంభకోణాలు... ఇలా ఒక్కొక్కటి బయట పడుతుండడంతో గులాబీ దండుకు దిక్కుతోచక 'బకాయి కార్డు' పేరుతో మోసపూరిత ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలుపుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యమని చెప్పారు. బిసి రిజర్వేషన్లతో మరోసారి నిరూపితమైందని చెప్పారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపితో బిఆర్ఎస్ ఒకటే అభిప్రాయంతో ఉన్నాయని ఆరోపించారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటై కుట్ర పూరితంగా కాంగ్రెస్‌పై విషప్రచారం చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బిఆర్ఎస్ చేసిన బాకీకి (అప్పులకు) కాంగ్రెస్ సర్కారు వడ్డీలు చెల్లిస్తోందని తెలిపారు.

7న హైదరాబాద్‌లో
పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

- వామపక్ష పార్టీల నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ దాడికి పాల్పడి ఈనెల ఏడో తేదీ నాటికి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఇజ్రాయిల్ దాష్టీకాలను ఖండిస్తూ, పాలస్తీనాకు సంఘీభావంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఈ ర్యాలీలో వామపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య, లౌకిక, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్దఎత్తున పాల్గొంటాయని తెలిపాయి. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్న ఈ ర్యాలీలో ప్రజలు, ప్రజాతంత్రవాదులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశాయి. మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు డిజి నరసింహరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, నాయకులు రమ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెవి చలపతిరావు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర నాయకులు భరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

పాలస్తీనాపై ఇజ్రాయిల్ జాతి హత్యాకాండను కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఎడతెరపి లేకుండా గాజా భూభాగం మీద బాంబులు కురిపిస్తూనే ఉందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతాన్యాహుల మధ్య జరిగిన చర్చలో గాజా నుంచి పాలస్తీనియన్లను తరిమేసి ఆ భూభాగాన్ని ఆక్రమించుకోవాలనే లక్ష్యం స్పష్టంగా కనపడుతున్నదని పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు బేషరతుగా అమెరికా అండదండలు అందిస్తూ సహకరిస్తున్నదని వివరించారు. గాజాలోకి మానవతా సాయం ప్రవేశించకుండా నిరోధిస్తూ ఆ ప్రాంత ప్రజానీకాన్ని ఆకలితో మాడ్చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. క్షుద్బాధకు తాళలేక పిల్లలు, పెద్దలు మరణిస్తున్న వార్తలు కలిచి వేస్తున్నాయని తెలిపారు. గాజాలో క్షామ పరిస్థితులు నెలకొన్నాయంటూ ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని గుర్తు చేశారు. గాజాలో నెలకొన్న దుర్భర పరిస్థితులు, ఇజ్రాయిల్ దాష్టీకాలను గురించి వార్తలు అందిస్తున్న జర్నలిస్టులను పథకం ప్రకారం ఇజ్రాయిల్ సేనలు హతమారుస్తున్నాయని విమర్శించారు. ఆఖరుకి ఆస్పత్రులను కూడా బాంబు దాడులతో ధ్వంసం చేస్తున్నదని తెలిపారు. గాజా భూభాగం శిథిలాల కుప్పలా మారిందని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ పచ్చి క్రూర రాజ్యంలా వ్యవహరిస్తున్నదనీ, దానికి ఈ దాడులే నిరూపిస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలు, రాయబార ప్రమాణాలను ఇజ్రాయిల్ అతిక్రమిస్తున్నదని విమర్శించారు. ఇజ్రాయిల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. పాలస్తీనాకు సంఘీభావంగా చేస్తున్న కార్యక్రమంతోపాటు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లకు నిరసనగా చేపట్టాల్సిన కార్యక్రమంపైనా చర్చించామని తెలిపారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానికసంస్థల ఎన్నికలకు సిపిఎం కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎర్రజెండాకు ప్రజలు మద్దతుగా నిలవాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రశ్నించే ఎర్రజెండా నాయకులను గెలిపించుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న ఎర్రజెండాకు ఎన్నికల్లో మద్దతు తెలిపి అత్యధిక స్థానాలకు గెలిపించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ కేటాయింపులో అవకతవకలు జరిగాయని, వాటిని సవరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టాలను తీర్చాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నూకల జగదీష్‌చంద్ర, నాయకులు రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, రేమిడాల పరుశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, భావాండ్ల పాండు, అయ్యూబ్, తిరుపతి, రామ్మూర్తి, జటంగి సైదులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో టెట్‌పై ఎస్‌టిఎఫ్ఐ రివ్యూ పిటిషన్ దాఖలు

- టిఎస్‌యుటిఎఫ్ నేతలు చావ రవి, వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయుల సర్వీసుకు సంబంధించిన టెట్ కేసులో ఎస్టీఎఫ్ఐ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధానకార్యదర్శి ఎ.వెంకట్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల తర్వాత ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులంతా సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్లల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్ కావాలనీ సుప్రీం తన తీర్పులో తేలాగే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు కూడా ప్రమోషన్ కావాలంటే టెట్ పాస్ కావాల్సిందేనంటూ సెప్టెంబర్ ఒకటో తేదీన సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి చావ రవి పేరిట న్యాయవాది సుభాష్ చంద్రన్ రివ్యూ పిటిషన్ వేశారు. ఈ నెల 17న ఎస్‌టిఎఫ్ఐ నాయకత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయవాదులతో సంప్రదింపులు చేసిన విషయం విదితమే. కాగా సుప్రీం తీర్పు దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయులపైన ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో ఎస్‌టిఎఫ్ఐ ముందడుగేసింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్సీటిఈ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వీలైనంత త్వరగా రివ్యూ పిటిషన్లు వేయాలని ఒక ప్రకటనలో కోరారు.

ప్రతి ఒక్క సిటిజన్ పోలీసే..

- ఏ సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకొని రావాలి: సిపి విసి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఒక్కరూ సిటిజన్ పోలీసే అని.. ఏ సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని హైదరాబాద్ సిపి విసి సజ్జనార్ అన్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సివి ఆనంద్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆర్‌టిసి ఎండిగా ఉన్న ఆయనను ప్రభుత్వం నగర సిపిగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. 1996 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారి విసి సజ్జనార్ గతంలో సైబరాబాద్ కమిషనర్‌గా పని చేశారు. నగర సిపిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. నగరంలో నేరాలను తగ్గించడంతోపాటు మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, గేమింగ్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. హైదరాబాద్ పోలీసులు మీ పోలీసులని.. ఏ సమస్య వచ్చినా తమకు తెలపాలని కోరారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అక్కడ పరిష్కారం కాకుంటే ఎసిపి వద్దకు వెళ్లాలని సూచించారు. ఆ తర్వాత పైస్థాయి అధికారికి లేదా నేరుగా తన దృష్టికి తీసుకొచ్చినా పర్వాలేదన్నారు. ఎక్కడ శాంతి భద్రతలు బాగుంటాయో ఆ నగరం అభివృద్ధి చెందుతుందని, హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సిపిలు, జాయింట్ సిపిలు, అన్ని జోన్ల డిసిపిలు, ఎసిపిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రూప్-1 నియామకాలు

- పదేళ్లలో నిరుద్యోగులను నిండా ముంచారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుడూ..ఇప్పుడూ.. కాంగ్రెస్ పాలనలోనే గ్రూప్-1 నియామకాలు జరిగాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రూప్ వన్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌లుగా నియమితులైన పలువురు అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగులను బీఆర్ఎస్ సర్కార్ నిండా ముంచిందని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాంలో 2011లో గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేయగా.. 2018లో భర్తీ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ వివిధ ఉద్యోగాలకు జారీ చేసిన నోటిఫికేషన్లను కావాలని గత సర్కార్ నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అలాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీపై నేడు విమర్శలు చేయడం శోచనీయమన్నారు ఉద్యోగాలు ఇవ్వాలన్నా, పేదలకు అండగా ఉండాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని పొంగులేటి స్పష్టం చేశారు. పదేండ్లలో టీజీపీఎస్సీని బీఆర్ఎస్ సర్కార్ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గత సర్కార్ చేసిన పొరపాట్లకు తావులేకుండా అన్ని ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తున్నామని గుర్తు చేశారు. రెండేళ్లలో దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి రికార్డు సాధించామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ విభాగాల్లో రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్యమైందనీ, కొత్తగా ఈ శాఖలో చేరిన మీరు ప్రభుత్వ ఆలోచనలకు, ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీతో, నిబద్ధతతో విధులు నిర్వహించాలని వారికి సూచించారు.

సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద వస్తోంది. అక్కడి నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి మంగళవారం సాయంత్రం 5,81, 628 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తంలో బయటకు విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్ 26 క్రస్ట్‌గేట్లలో 24 గేట్లు 15 అడుగులు, రెండు గేట్లు 20 అడుగుల మేర ఎత్తి దిగువనకు 5,31,534 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కుడి కాలువ ద్వారా 9533 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6556 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 32,805 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 584.10 అడుగుల నీటిమట్టం ఉంది.

విద్యార్థి గల్లంతు

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ ఆంజనేయస్వామి పుష్కర్ ఘాట్ వద్ద కృష్ణా నదిలో విద్యార్థి గల్లంతయ్యాడు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఆరుగురు విద్యార్థులు విహారయాత్ర నిమిత్తం నాగార్జునసాగర్‌కు వెళ్లారు. పుష్కర్ ఘాట్ వద్ద సరదాగా ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు చాణిక్య (18) నదిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు చర్యలు చేపట్టింది.

జర్మనీలో భర్త ఆచూకీ కోసం మహిళ ఫిర్యాదు

- ఆడపడుచుకు అండగా నిలిచిన సర్కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెనడాలో నివాసముంటున్న తనకు చెప్పకుండా జర్మనీకి వెళ్లిపోయిన భర్త ముజమిల్‌గులాబ్ నాయక్ వాడి ఆచూకీ కనుగొని న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఓల్డ్ మలక్‌పేట్‌కు చెందిన షబానా నస్రిన్ అహ్మద్ సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తక్షణం స్పందించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ సిఎం ప్రజావాణి ఇన్‌ఛార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రికి లేఖ రాసి నస్రీన్‌కు న్యాయం చేయాలని కోరారు. శేషాద్రి ఆదేశాల మేరకు రాష్ట్ర సచివాలయ సాధారణ పరిపాలనా విభాగం ఎన్నారై విభాగం అధికారులు జర్మనీ, కెనడా ఇండియన్ ఎంబసీలకు, కేంద్ర ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖలకు ఉత్తరం ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఎన్నారై మహిళా విభాగం అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్‌ను పూతం కోరుతూ కూడా జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు లేఖ రాశారు. ఈ మేరకు సిఎం ప్రజావాణి ఇంచార్జ్ జి చిన్నారెడ్డికి జిఎడి ఎన్నారై విభాగం సంయుక్త కార్యదర్శి శివలింగయ్య తిరుగు సమాధానమిచ్చారు. ఈ వ్యవహారం అంతా చకచకా నాలుగు రోజుల్లో జరిగిపోయింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముజామిల్‌తో ఆరేండ్ల క్రితం పెళ్లి జరిగిందని, కెనడా నుంచి ఇండియాకు రావాలంటే తన నాలుగేండ్ల బిడ్డకు ఇండియన్ పాసుపోర్టు సహా పలు డాక్యుమెంట్స్‌పై తండ్రి సంతకాలు అవసరమనీ, భర్త ఆచూకీ కోసం షబానా నస్రిన్ ఇచ్చిన పవర్ ఆఫ్ ఆటార్నీ ద్వారా తల్లి సెప్టెంబర్ 19న సీఎం ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు. చిన్నారెడ్డి తక్షణ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. తెలంగాణ ఆడబిడ్డకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆమెకు పూర్తి భరోసాను కల్పిస్తూ నస్రీన్‌కు న్యాయం చేసేందుకు యావత్ ప్రభుత్వం యంత్రాంగం కృషి చేస్తున్నారు. ఈ మేరకు ప్రజావాణి విభాగం ఒక ప్రకటన విడుదల చేశారు.

త్వరితగతిన గాంధీ జయంతి ఏర్పాట్లు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ జయంతి నేపథ్యంలో చేపట్టిన పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బాపు ఘాట్‌లోని పలు ప్రాంతాలను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం బాపూ మ్యూజియం హాల్‌లో ఏర్పాట్లపై చేపట్టిన సమావేశంలో అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖల వారీగా కేటాయించిన పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. అంతకుముందు బాపు ఘాట్‌ను సందర్శించి పనుల పురోగతిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈనెల 2న గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు బాపు ఘాట్, మ్యూజియంను సందర్శించనున్నందున ఏర్పాట్లల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ ఉత్పన్నం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత విద్యుత్ శాఖ, విద్యాశాఖ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, సమాచార శాఖ, ఉద్యానవన శాఖ, ఫైర్, పోలీస్, పర్యాటకశాఖ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై ఆమె సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ రామకృష్ణారావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ వెంకటి, డిప్యూటీ డిఇఒ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ అహల్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు విధానం ప్రారంభం

జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పక పాటించాలని కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్ రెండో అంతస్తులోని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలనితో కలిసి ప్రారంభించారు. బయోమెట్రిక్ హాజరు ద్వారా సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆలస్యం చేస్తే హాజరులో వ్యత్యాసాలు వస్తాయని అన్నారు. సమయానికి కార్యాలయానికి రావాలని, లేని యెడల బయోమెట్రిక్ మిషన్‌లో గైర్హాజరుగా నమోదవుతుందన్నారు. ఈ విధానాన్ని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడూ పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి, జిల్లా సర్వే అధికారి వి శ్రీరామ్, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మహేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఎం.వెంకటేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కేసుల్లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీజనల్ వ్యాధుల కేసుల్లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధుల పూర్తి నియంత్రణకు ఈ ఏడాది తీసుకున్న చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు తగ్గుముఖం పట్టాయని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం వల్లే కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టాయని అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల్లో అవగాహనను కల్పించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో సీజనల్ రోగాలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్టు వారు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సిఇఒ ఉదయ్ కుమార్, రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్పెషల్ పాల్గొన్నారు.

సిఎంను కలిసిన మంత్రి జూపల్లి

- బతుకమ్మ గిన్నిస్ రికార్డు పత్రం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించాయని జూపల్లి సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని సిఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి వల్లూరి క్రాంతి పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లాలో రెండు బైక్‌ల ఢీ.. ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుద్దాల శివారులో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. ముగ్గురు యువకులు ఓ బైక్‌పై సుల్తానాబాద్‌కు తిరిగి వస్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సుల్తానాబాద్‌కు చెందిన రాకేశ్ (30), అభి (25) మృతిచెందారు. రఘు, ఆదర్శ్ అనే మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తెల్లవారుజామున ఘటనాస్థలికి స్థానిక సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రవణ్ చేరుకుని పరిశీలించారు.

టికెట్ కోసం ఆధార్ అడిగినందుకు.. మహిళ హల్‌చల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉచిత బస్సు టికెట్ కోసం ఆధార్ చూపించాలని అడిగిన ఆర్‌టిసి కండక్టర్‌పై ఓ మహిళ హల్‌చల్ చేసింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ పంచాయతీకి చెందిన బోయ చిట్టి (36) మద్యం తాగి కొత్త గూడెం బస్టాండ్‌లో ఖమ్మం వెళ్లే బస్సు ఎక్కారు. ఉచిత బస్సు టికెట్ కోసం ఆధార్ కార్డు చూపించాలని కండక్టర్ ఆమెను అడిగారు. తన దగ్గర ఆధార్ లేదని వాదనకు దిగడంతో మహిళను విద్యానగర్‌లో బస్సు నుంచి కిందికి దించారు. తనని బస్సు నుంచి కిందికి దింపుతారా అని మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బస్సు కింద పడుకొని హల్‌చల్ చేసింది. దీంతో పోలీసులు అక్కడి చేరుకుని ఆమెను పీఎస్‌కు తరలించారు. కుటుంబసభ్యులను పిలిపించి మందలించి ఆమెను వదిలేశారు.

మంత్రి పొన్నం నివాసంలో బిసి నేతల కీలక సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బిసి నేతల కీలక సమావేశం జరిగింది. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, పలువురు ఎమ్మెల్యేలు సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు. న్యాయపరమైన అంశాల్లో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై సమాలోచనలు జరిపారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని నేతలు ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయి. తమిళనాడులో ఇటీవల కోర్టు తీర్పు గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు మూడు నెలలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చని ఉందని, ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయని నేతలు భావిస్తున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR
O.S.No. 376/2023

1. Medamala SudhaRani, aged about 52 years, wife of late Narasimhulu, Hindu, House wife,
2. Medamala Uday Kumar, aged about 32 years, son of late Narasimhulu, Hindu, working as a Junior Assistant in S.P. Office.
3. Medamala Kiran Kumar, aged about 21 years, Son of late Narasimhulu, Hindu, Student.

Petitioner No.1 to 3 are residing in D.No.66/91, Mariyapuram, near ward Secreterate, Ravindranagar, Kadapa Town and District.

...Plaintiffs

Vs

2. Konireddy Kalpana, aged about 33 years, wife of Sudarshan Reddy, Hindu, House wife, residing at Flat No.302, 12-2-4, Venkat Residency, New goodshed road, Mosapeta, Balanagar, Telangana. 500018.

...Defendant No.2

2వ ప్రతివాదికి దావా సమను మరియు నోటీసు

ఈ నెంబరు దావాలోని వాదులు, 1 నుంచి 3 ప్రతివాదులు పైన రాజశ్రీపై కోర్టు యందు దావా షెడ్యూలు ఆస్తి యందు వాదులకే హక్కు, బాధ్యతలు ఉన్నాయని దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాతోపాటుగా I.A.No.1478/2023 పిటిషన్ ద్వారా షెడ్యూలు ఆస్తిని అమ్మ కూడదని పిటిషన్ కూడా దాఖలు చేసియున్నారు. అట్టి దావాలో, పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన నీకు 16.10.2025నాడు వాయిదా ఉంటుఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం 10.30ని॥లకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.

వాయిదా తేది: 16.10.2025

//By Order of the Court//

పి. చంద్రశేఖర్
అడ్వకేట్, ప్రొద్దుటూరు.
కడప జిల్లా. సెల్: 9866635497.

కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా టిమ్స్

- నిమ్స్ తరహాలో టిమ్స్‌లకు స్వయం ప్రతిపత్తి
- క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల నడుమ స్పష్టమైన పని విభజన
- అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి దామోదర

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సనత్‌నగర్, కొత్తపేట్, అల్వాల్ టిమ్స్ హాస్పిటళ్లను కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా తీర్చిదిద్దాలని ఉన్నతాధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో పరిశుభ్రత, పేషెంట్‌కేర్‌కు సమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిమ్స్ తరహాలో టిమ్స్‌లలోనూ స్వయం పాలన వ్యవస్థ ఉండాలన్నారు. త్వరలో సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభించనున్న నేపథ్యంలో, అధికారులతో మంగళవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ సిఇఒ ఉదయ్ కుమార్, డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, ప్రొఫెసర్ విమలా థామస్ తదితరులు పాల్గొన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు, ఎయిమ్స్‌లో అవలంభిస్తున్న విధానాలపై ఇప్పటికే అధికారులు అధ్యయనం చేసి రూపొందించిన నివేదికలోని అంశాలను అధికారులు మంత్రికి వివరించారు. కార్పొరేట్ హాస్పిటళ్లలో క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాలు పని చేస్తున్న విధానం, డాక్టర్లు, సిబ్బంది సంఖ్య, పెడుతున్న ఖర్చు, తదితర అంశాలను మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నిరకాల వసతులతో హాస్పిటళ్లు ఉండాలని, అందుకు అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కార్పొరేట్ హాస్పిటళ్ల తరహాలో క్లినికల్ సర్వీసెస్, అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్, అకాడమిక్స్ విభాగాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. నిమ్స్ తరహాలో మెడికల్ డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్‌తో పాటుగా చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ కూడా ఉండాలన్నారు. ఏయే విభాగానికి ఎవరు బాధ్యులు, ఎవరి పని ఏంటి అన్నదానిపై స్పష్టమైన జాబ్‌చార్ట్ ఉండాలని మంత్రి ఆదేశించారు. గతంలో ధనవంతులు, పెద్ద పెద్ద నాయకులు కూడా చికిత్స కోసం గాంధీ, ఉస్మానియాకు వెళ్లేవారని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు టిమ్స్‌లను ఆ స్థాయిలో తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

బాకీ కార్డే.. మనకు బ్రహ్మాస్త్రం

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో బాకీ పడ్డ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ కార్డులోని పథకాలను.. అమలు చేయకుండా ప్రజలకు బాకీ పడింది. ఆ బాకీలను కార్డు రూపంలో ప్రచురించాం. అవి మనకు బ్రహ్మాస్త్రం.. వాటిని ఇంటింటికి పంపిణీ చేయాలి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన 'కాంగ్రెస్ బాకీ కార్డు' విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం బాకీ పడింది? ఒక్కొక్క మహిళకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క రైతుకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క ఇంటికి ఎంత బాకీ పడ్డదో తెలిసేలా బాకీ కార్డు విడుదల చేస్తున్నామని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు పండుగకు ఊర్లకు వస్తారని, రేపు నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ బాకీ కార్డు పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి రైతుకు కాంగ్రెస్ పార్టీ రూ.75 వేల రైతుబంధు బాకీ పడిందన్నారు. రైతుబంధు రైతుకి ఇస్తాం, కౌలు రైతుకి ఇస్తామన్నారని.. కానీ ఇప్పటివరకు ఒక రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలకు ప్రకటించిన రూ.2500 పథకం ద్వారా రూ.44వేలు బాకీ పడ్డారన్నారు. అవి ఇచ్చిన తర్వాతే.. కాంగ్రెస్ వాళ్లు ఎవరైనా ఓటు అడగాలని తెలిపారు. అలాగే, జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బంద్ అయిందన్నారు. పండుగ పూట కనీసం కరెంటు బుగ్గలు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గ్యారంటీలకు టాటా చెప్పిండు.. లంక బిందెల కోసం రేవంత్ రెడ్డి వేట పట్టిండు" అని అన్నారు. కంచె గచ్చిబౌలి, బంజారా హిల్స్, జూబ్లీహిల్స్‌లో భూములు అమ్ముతా అని బయలుదేరిండని ఆరోపించారు. తమిళనాడులో అక్కడి గవర్నమెంట్ పొద్దున్న టిఫిన్ పెడుతుందని పొగిడిన సిఎం.. కెసిఆర్ ప్రారంభించిన సిఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అధికారంలోకి వచ్చినంక ఎందుకు బంద్ పెట్టారని ప్రశ్నించారు. ఢిల్లీకి మూటలు కట్టడానికి, కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు తీసుకొని బీహార్ ఎన్నికలకు పంపడానికి పైసలు ఉన్నాయి గాని.. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయడానికి మాత్రం పైసలు లేవా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బిఆర్ఎస్ కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మెడికల్ పిజిలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికల్ పిజిలో అడ్మిషన్ల కోసం కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇన్ సర్వీస్, నాన్ సర్వీస్ కోటా కింద అడ్మిషన్లను తీసుకోనున్నారు. నీట్-2025లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అక్టోబర్ ఒకటి నుంచి ఎనిమిదో వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు అవసరమైన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వైబ్‌సైట్‌లో నోటిఫికేషన్ చూసి తెలుసుకోవచ్చు.

రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్‌ఒగా లలితాదేవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారిగా డాక్టర్ కె.లలితాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బి రవీందర్ నాయక్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె వికారాబాద్ ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒగా విధులు నిర్వహిస్తున్నారు. లలితాదేవిని రంగారెడ్డి డిఎంహెచ్‌ఒగా నియమించడంతో, వికారాబాద్ డిఎంహెచ్‌ఒగా ప్రస్తుతం బషీరాబాద్ లో విధులు నిర్వహిస్తున్న డాక్టర వై పవిత్రను నియమించారు.

నాగార్జునసాగర్‌లో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ ఆంజనేయస్వామి పుష్కర్ ఘాట్ వద్ద కృష్ణా నదిలో విద్యార్థి గల్లంతయ్యాడు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఆరుగురు విద్యార్థులు మంగళవారం విహారయాత్ర నిమిత్తం నాగార్జునసాగర్‌కు వెళ్లారు. పుష్కర్ ఘాట్ వద్ద సరదాగా ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు చాణిక్య (18) నదిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌డిఆర్‌ఎఫ్ బ ందం గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు చర్యలు చేపట్టింది.

ఎన్నికలు బహిష్కరిస్తున్నాం..

- రిజర్వేషన్లు కల్పించాలని బండ లేమూర్ దళితుల ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ గ్రామంలో ఎంపిటిసి, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు ఎస్‌సిలకు రిజర్వేషన్లు కల్పించలేదని, అందుకే తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బండ లేమూరు గ్రామస్తులు ప్రకటించారు. మంగళవారం గ్రామానికి చెందిన దళితులు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 10 వార్డులు ఉంటే ఐదు స్థానాలు ఎస్‌టిలకు, మూడు స్థానాలు బిసిలకు, రెండు స్థానాలు జనరల్‌కు రిజర్వు చేశారని తెలిపారు. 200 ఓట్లు ఉన్న ఎస్‌సిలకు ఎలాంటి రిజర్వేషన్ కల్పించలేదని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే తమకు అన్యాయం జరిగిందని, దీనికి నిరసనగా రానున్న స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆకారం కృష్ణ, మహేష్, కొంకణి విజయ్, జె లింగస్వామి, దిలీప్, శివ, పరమేశ్, మహేష్ ఉన్నారు.

ఏజెన్సీ ప్రాంతం స్థానిక ఎన్నికల్లో ... గిరిజనేతర రిజర్వేషన్లను నిలుపుదల చేయాలి

- టిఎజిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో (స్థానిక సంస్థల ఎన్నికల్లో) గిరిజనేతరులకు రిజర్వేషన్ అమలు చేయొద్దని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) కోరింది. ఏజెన్సీ ప్రాంతంలో జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలను కూడా గిరిజనులకు రిజర్వేషన్ కేటాయించాలని కోరింది. ఈమేరకు మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాజీ ఎంపి డాక్టర్ మీడియా బాబురావు, పూసమ్ సచిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిరిజనేతర రిజర్వేషన్లలో ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో మినహాయించాలని కోరారు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు అవకాశం ఇచ్చే రోటేషన్ పద్ధతిని ఆపాలని డిమాండ్ చేశారు. మిగిలిన జిల్లాల కంటే అధిక గిరిజన జనాభా కలిగిన జిల్లాల్లో జిల్లా పరిషత్ స్థానాలకు ఎస్టీ రిజర్వేషన్ ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ, చట్టాల పరిరక్షణ చేయాలని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిల్లా పరిషత్ రిజర్వేషన్లలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరగబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కుమురం భీం, మహబూబాబాద్ జిల్లాలను జనరల్ స్థానాలుగా ప్రకటించడం, పూర్తి స్థాయిలో ఏజెన్సీ, ఆదివాసీలు ఉన్న మండలాల్లో జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలను జనరల్, ఇతర వారికి రిజర్వు చేస్తూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడం ఆదివాసీ హక్కులకు భిన్నమని పేర్కొన్నారు. పిసా చట్టాలను నిరుగార్చేలా ఉన్నాయని విమర్శించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతం జిల్లాల్లో జడ్‌పి చైర్మన్, జడ్‌పిటిసి స్థానాల్లో ఎస్‌టిలను కొనసాగించేలా ఉత్తర్వులు సరి చేయాలని డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్ హక్కులను హరించేలా ప్రభుత్వ విధానం అక్కడ నివసిస్తున్న స్థానిక ఆదివాసీ ప్రజల అవకాశాలను దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళితులు

మహేందర్‌పై ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దౌర్జన్యం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.మహేందర్‌పై అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడటాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ వారి తరపున పోరాటం చేస్తున్న తమ పార్టీ నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబర్‌పేట్‌లో వరదబాధితులకు పురుగులతో కూడిన బియ్యాన్ని ఎమ్మెల్యేతోపాటు అధికారులు పంచారని తెలిపారు. దాన్ని మహేందర్‌తోపాటు సిపిఎం నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలంటూ విజ్ఞప్తి చేశారని పేర్కొన్నారు. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నోటికొచ్చినట్టు బూతులు తిడుతూ అక్కడి నుంచి ఈడ్చుకెళ్లాలని, తర్వాత వాడి అంతు చూస్తానని మహేందర్‌ను బెదిరించారని, ఇది సరైంది కాదని తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న సాగం

బిజెపి విధానాలతో వ్యవసాయ సంక్షోభం

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ సంక్షోభానికి కారణం అవుతున్న బిజెపి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో 'పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాలను పునరుద్ధరించాలి" అనే అంశంపై ఏఐయూకెఎస్ జిల్లా అధ్యక్షులు భగవంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజలయ్య అధ్యక్షతన నారాయణపేట జిల్లా కేంద్రంలో మంగళవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. పత్తి సాగులో నారాయణపేట్ జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. తానెప్పుడూ రైతుల వైపే ఉంటానని మాట ఇచ్చిన మరుసటి రోజే పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాన్ని ప్రధాని మోడీ ఎత్తేశారని తెలిపారు. అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ భారత్‌లో పర్యటించిన తరువాత వంట నూనెలపై పది శాతం సుంకాన్ని కూడా మోడీ ఎత్తేశారని చెప్పారు. అమెరికాకు తలొగ్గి.. అన్ని ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు ఎత్తేయడం ద్వారా ఇక్కడి రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మిల్లుదారులు అమెరికా పత్తిని, వంట నూనెలను దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడి రైతులు చాలా నష్టపోతారని తెలిపారు. దిగుమతి సుంకాలు అనేవి ఇప్పటి వరకు దేశానికి రక్షణ కవచంగా ఉన్నాయన్నారు. ఎప్పుడూ స్వదేశీ జపం చేసే మోడీ పరివారం.. విదేశీ దిగుమతులు పెంచి స్వదేశీ రైతులను ఆత్మహత్యల వైపు నెడుతున్నారని విమర్శించారు. గత ఎన్నికల ప్రచారంలో మోడీ దేశ రైతులకు రెండింతల ఆదాయం తెచ్చి పెడతానని వాగ్దానం చేసి.. అధికారంలోకొచ్చాక ఉన్న ఆదాయం కోల్పోయేలా చేశారని ఏఐయూకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి.ప్రభాకర్ అన్నారు. ఇతర దేశాల్లో వ్యవసాయ పెట్టుబడికి రెండింతల ధర ఇస్తారు కానీ దేశంలో రాను రాను సబ్సిడీలను ఎత్తేసి కార్పొరేట్‌లకు 16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని విమర్శించారు. దేశంలోకి అమెరికా పత్తి, వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్న మోడీపై తమ మొక్కజొన్నలు కూడా దిగుమతి చేసుకోవాలని అమెరికా ఒత్తిడి చేస్తోందని తెలిపారు. పత్తి సాగు చేసినప్పటి నుంచి రైతులు నష్టపోతూనే ఉన్నారని ఏఐయూకెఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.రాము అన్నారు. మరోవైపు పాలకుల విధానాలతో రైతులు మరింత నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, ఏఐయూకెఎస్ జిల్లా కార్యదర్శి బి యాదగిరి, ఎఐపికెఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీమ్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

ఎసిబి దూకుడు... సెప్టెంబర్‌లో 23 కేసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో యాంటీ కరప్షన్ బ్యూరో దూకుడుగా ముందుకు సాగుతోంది. లంచాల కోసం ప్రజలను వేధిస్తున్న అన్ని శాఖల్లోని లంచగొండు అధికారుల కోసం నిత్యం జల్లెడ పడుతోంది. ఈ క్రమంలో సెప్టెంబర్ నెలలో మొత్తం 23 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాజాగా అవినీతి నిరోధక శాఖ వెల్లడించింది. వీటిలో ట్రాప్ కేసులు 11, అక్రమాస్తుల కేసులు 2, క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు 2, సాధారణ ఎంక్వైరీలు 2, ఆకస్మిక తనిఖీలు 2 నమోదు అయినట్లు పేర్కొంది. అవినీతి కేసులో పట్టుబడిన వారిలో 22 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా ఒకరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఉన్నట్లు వెల్లడించింది. వీరందరిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమైండ్‌కు తరలించామని, వివిధ శాఖల్లోని ట్రాప్ కేసులో రూ.8,91,000 సీజ్ చేశామని తెలిపింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో రూ.14,05,83,00 వెలికితీసినట్లు పేర్కొంది.

ఇప్పటివరకు 203 కేసులు:

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు వివిధ డిపార్ట్ మెంట్లపై రెయిడ్స్ చేసిన ఎసిబి.. మొత్తం 203 కేసులు నమోదు చేసింది. వీటిలో 119 ట్రాప్ కేసులు, 13 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, 20 క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు, 25 రెగ్యులర్ ఎంక్వైరీలు, 23 సర్ప్రైజ్ చెకింగ్‌లు, 3 డిస్ట్రిక్ట్ ఎంక్వైరీలు ఉన్నట్లు ఏసీబీ తెలిపింది. ఈ కేసుల్లో 189 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని వీరిలో 15 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసిన జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు తెలిపారు. ట్రాప్ కేసుల్లో రూ. 42,03,500 స్వాధీనం చేసుకోగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రూ.58,36,18724 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 16న నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలం తహశీల్దార్ శ్రీనివాస్ రాజును ఎసిబి పట్టుకుందని ఇతడికి ఒక ఏడాది కఠిన జైలుశిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధించినట్లు ఎసిబి తెలిపింది. ప్రభుత్వ అధికారులు లంచం కోరితే ఎసిబికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేసి చెప్పాలని ఫిర్యాదు చేసే వారి పేరు వివరాలు రహస్యంగా ఉంచబడతాని ఎసిబి అధికారులు తెలిపారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి

- కాస్తులో ఉన్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి : జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమావేశంలో మాట్లాడుతునన జి నాగయ్య

పోడు భూముల సమస్యను పరిష్కరించి కాస్తులో ఉన్న ప్రతి రైతుకూ హక్కు పత్రాలు అందించాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో పార్టీ జిల్లా నాయకులు జనగం వీరస్వామి అధ్యక్షతన పోడు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు చేస్తున్న పోడు భూములకు ప్రభుత్వాలు హక్కులు కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా తరతరాల నుంచి సాగు చేస్తున్న రైతులకు ఎలాంటి హక్కులు లేకపోవడం వల్ల పోడు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ మండలాలైనా కొత్తగూడ, గూడూరు, గంగారం మండలాల్లో ఎంతోమంది అర్హులైన రైతులకు నేటికీ హక్కు పత్రాలు లేదని తెలిపారు. దాంతో ప్రభుత్వాల నుంచి అందాల్సిన రైతుబంధు, రైతు భీమా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన రాయితీలు అందడంలేదని అన్నారు. పట్టాదారు పాసుబుక్కులు లేనందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పండించిన పంటలను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కాస్తులో ఉన్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పోడు రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం 18 మందితో పోడు భూముల సాధన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జనగం వీరస్వామిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిపిఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గూడూరు, కొత్తగూడ, గంగారం నాయకులు నక్క సైదులు, లక్ష్మయ్య, రామటెంకి రామచంద్రయ్య, జనగాం సురేష్, రమేషు, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, మల్లేష్, చంటి, సుమలత, వెంకన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ @ 25 ఏళ్లు

- కుట్రలు, ప్రయివేటీకరణ అడ్డంకులు దాటుకుని ముందుకు
- 2005 నాటికి టెలికాం రంగంలో నెంబర్ వన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) దిగ్విజయంగా 25 ఏళ్లపూర్తి చేసుకుంది. సిల్వర్ జూబ్లీ వేడుకలకు సన్నద్ధమవుతోంది. పాలకుల ప్రయివేటీకరణ కుట్రలు, కుతంత్రాలు... మరోవైపు ప్రయివేటు రంగ సంస్థల తీవ్ర పోటీ... ఇలా అన్నింటినీ తట్టుకుని, దాటుకుని వడివడిగా ముందుకు సాగుతోంది. ఏర్పడిన తొలి ఐదేళ్లలోనే నెంబర్‌వన్ స్థానానికి చేరుకున్న ఆ సంస్థ కార్పొరేట్ సంస్థల ఒత్తిడితో కేంద్ర పాలకులు శీతకన్ను వహించడం, 4జి, 5జి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ రంగ సంస్థకు ఇవ్వకుండా ప్రయివేటు వైపు పాలకులు మొగ్గుచూపడంతో ఇక బిఎస్ఎన్ఎల్ మూతపడబోతుందా? అనే దాకా పరిస్థితి వెళ్లింది. కానీ, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఇతర ఉద్యోగ సంఘాల పోరాట పటిమతో ఆ సంస్థ ప్రయివేటీకరణ ఆగిపోయింది. పడిలేచిన కెరటంలా ప్రయివేటు టెలికాం రంగ సంస్థలను ధీటుగా ఎదుర్కొంటూ మళ్లీ వినియోగదారులను ఆకర్షిస్తోంది. తన వృద్ధిని క్రమంగా పెంచుకుంటోంది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) పబ్లిక్ సెక్టార్ కంపెనీ. 2000 సంవత్సరంలో అక్టోబర్ ఒకటో తేదీన పురుడుపోసుకుంది. ప్రజలకు మెరుగైన టెలికాం సేవలను సరసమైన ధరలకే అందిస్తూ అనతికాలంలోనే నెంబర్‌వన్ స్థానానికి చేరుకున్నది. 2.5 లక్షల మంది ఉద్యోగుల పట్టుదల, కృషి దాని వెనుక దాగి ఉంది. రిజర్వు ఫండ్ బ్యాలెన్స్ రూ.50 వేల కోట్లకు చేరుకున్నది. ఏటా వేల కోట్ల రూపాయలు లాభాలు గడించింది. దీంతో కార్పొరేట్ కంపెనీలు టెలికాం రంగంపై మరింత ఫోకస్ పెట్టాయి.

పెద్ద ఎత్తున లాభాలను ఆర్జించే టెలికాం సేవలను ప్రయివేటీకరించి కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే ప్రణాళికతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగింది. మిగతా ప్రభుత్వ రంగ సంస్థల మాదిరిగానే బీఎస్ఎన్ఎల్‌ను కూడా ప్రయివేటీకరించాలనే ప్రయత్నం తీవ్రస్థాయిలోనే జరిగింది. ఉద్యోగ సంఘాల ప్రతిఘటనతో అది సాధ్యం కాలేదు. కానీ, మరోవైపు కేంద్రం 2జీ స్పెక్ట్రం, ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని బీఎస్ఎన్ఎల్‌కు ఇవ్వకుండా ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టింది. రూ.50,000 కోట్లకు పైగా బ్యాంక్ బ్యాలెన్స్‌ను బిఎస్ఎన్ఎల్ యాజమాన్యానికిగానీ, ఉద్యోగులకు గానీ తెలియకుండా కేంద్రం బలవంతంగా లాక్కున్ని మరింత బలహీనపర్చింది.

విఆర్ఎస్ పేరుతో 80 వేల మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపింది. సేవల విస్తరణలో ఆటంకం సృష్టించింది. మరోవైపు ప్రయివేటు టెలికాం రంగ సంస్థలకు అన్ని ప్రయోజనాలను మంజూరు చేస్తూ పోయింది. ఇంకోవైపు ఆ ప్రయోజనాలు బిఎస్ఎన్ఎల్‌కు దక్కకుండా నిరాకరించింది. దీంతో ఆ సంస్థ గ్రాఫ్ క్రమంగా పడిపోతూ వచ్చింది. ప్రయివేటు టెలికాం రంగ సంస్థలు 4జి, 5జి సేవలు అందిస్తున్న కాలంలో బిఎస్ఎన్ఎల్ 2జి, 3జి సేవలతో నెట్టుకురావాల్సిన పరిస్థితి. దీంతో మెరుగైన సేవల కోసం అనివార్యంగా బిఎస్ఎన్ఎల్ కస్టమర్లు ప్రయివేటు సంస్థల వైపు ఆకర్షితులు కావడం మొదలు పెట్టారు. 2005లో టెలికాం రంగంలో 21 శాతం వాటాను కలిగిన బిఎస్ఎన్ఎల్ 2022 నాటికి 7.9 శాతానికి పడిపోయింది. మన దేశంలో నాలుగో అతిపెద్ద టెలికాం రంగ సంస్థగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 25వ స్థానంలో ఉంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురంభీం ఆసిఫాబాద్ కెరమెరి మండలంలోని తుమ్మగూడ గ్రామంలో మంగళవారం అప్పుల బాధతో ఓ రైతు పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌహాన్ అరవింద్ (34)కు తుమ్మగూడ గ్రామ శివారు లో పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి పంట సాగు చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పంటను నాశనం చేశాయి. దీంతో పెట్టిన పెట్టుబడి రాదని మనస్తాపానికి గురై చేనులోనే పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలోనే అరవింద్ మృతిచెందారు. రైతుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.